# ధరలు దించకపోతే కేంద్రంపై పోరాటమే

- సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో జంగ్ సైరన్ మోగిస్తం
- రామగుండం ఎమ్మెల్యే చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరుకంటి చందర్

గోదావరిఖని, జనవరి 13: దండగన్న వ్యవసాయాన్ని సీఎం కేసీఆర్ పండుగలా మార్చుతుంటే.. కేంద్రంలోని మోడీ సర్కారు ఎరువుల ధరలు పెంచుకుంటూ పోతున్నదని, పెంచిన రేట్లు తగ్గించకపోతే పోరాటం తప్పదని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరించారు. గురువారం గోదావరిఖనిలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయంలో అనేక సంస్కరణలు తెచ్చి రాష్ట్రాన్ని దేశానికి దిక్సూచిగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌ది అని కొనియాడారు. రాష్ట్రంలో నడుస్తోంది రైతు రాజ్యమనీ, రైతాంగం సంక్షేమం కోసం ఉచితంగా కరెంటు, రైతు బీమా, పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. ఇదిలా ఉంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, తీవ్ర నష్టం కలుగజేస్తున్నదని మండిపడ్డారు. ఇప్పుడు పెంచిన యూరియా ధరలను వెంటనే తగ్గించాలని, లేదంటే సకల జనులు ఒక తాటిపైకి వచ్చి బీజేపీ నాయకత్వానికి తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఇక్కడ మేయర్ డా.అనిల్‌కుమార్, నాయకులు బొడ్డు రవీందర్, వేణు, చెల్కలపల్లి శ్రీనివాస్, అడ్డాల రామస్వామి, దేవరాజ్, తిరుపతి, మారుతి, మండ రమేశ్, కనకయ్య, సింహాచలం, రత్నాకర్, సన్ని, బెందె నాగభూషణం, కొంరయ్య, తూముల రాజేశ్వరరావు, బిక్కినేని నర్సింగరావు ఉన్నారు.

# మేం ఇస్తుంటే.. వాళ్లు లాక్కుంటున్నరు

- రైతన్నపై కేంద్రంలోని బీజేపీ కత్తిగట్టింది
- ఎరువుల ధరలు ఎట్లా పెంచుతరు
- మీ పతనం మొదలైనట్లే
- పెంచిన రేట్లు తగ్గించాలి
- ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



గంగాధర, జనవరి 13: కేంద్రంలోని బీజేపీ రైతులను నిండా ముంచుతున్నదని, ఇన్నేండ్లలో ఒక్క పనీ చేయలేదని, ఓవైపు రాష్ట్ర సర్కారు పంటకు పెట్టుబడి సాయం ఇస్తుంటే.. మరోవైపు కేంద్రం ఎరువుల ధరలు పెంచుతూ లాక్కుంటున్నదని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఎద్దేడ్చిన ఎవుసం రైతేడ్చిన రాజ్యం బాగుపడింది లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు వ్యవసాయాన్ని తాకట్టు పెట్టి రైతులను వారి సొంత పొలాల్లో కూలీలుగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని దుయ్యబట్టారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల కోసమే వ్యవసాయ చట్టాలను రద్దు చేసినట్లు నాటకాలు ఆడుతోందని రైతులు వాటిని నమ్మవద్దన్నారు. రైతు సంక్షేమ పథకాలతో తెలంగాణ సర్కారు రైతును రాజును చేయడానికి ప్రయత్నం చేస్తుంటే, వ్యవసాయ వ్యతిరేక చట్టాలతో అదాని, అంబానీలకు వ్యవసాయ భూములను ధారదత్తం చేసేందుకు కుట్ర పన్నుతున్నదని దుయ్యబట్టారు. కేంద్రం ఇన్నేండ్లలో రైతులకు ఏ ఒక్క మంచి పనీ చేయలేదని, పైగా రైతులకు మరింత నష్టం చేకూర్చే చర్యలకు పూనుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల ధరలను పెంచడం, వ్యవసాయ బావులు, బోర్లకు విద్యుత్ మీటర్లు బిగించి బిల్లులు వసూలు చేయడం, ధాన్యం కొనుగోలు చేయకపోవడం వంటి అంశాలు రైతులపై కేంద్రానికి ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయన్నారు. పెంచిన ఎరువుల ధరలను తగ్గించాలని సీఎం కేసీఆర్ ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశారని, కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ధరలను తగ్గించకపోతే మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

# ఫైనాన్స్ వ్యాపారులపై టాస్క్‌ఫోర్స్ దాడులు

- చందుర్తిలో 2కోట్ల విలువైన ప్రాంసరీ నోట్లు స్వాధీనం
- సిరిసిల్లలో ఒకరి అరెస్ట్



సిరిసిల్ల రూరల్: నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సిరిసిల్ల రూరల్/రుద్రంగి(చందుర్తి), జనవరి 13 : జిల్లాలో అధిక వడ్డీ, ఫైనాన్స్ వ్యాపారులపై రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదేశాలతో టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు కొనసాగుతున్నాయి. చందుర్తి మండల కేంద్రంలో అక్రమ వడ్డీ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు గురువారం మోతె మంగ ఇంటిపై పోలీసులు దాడులు నిర్వహించి ప్రామిసరీ నోట్లు, సాదబైనామా పేపర్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. వేములవాడ డీఎస్పీ చంద్రకాంత్ మాట్లాడుతూ చందుర్తి గ్రామానికి చెందిన ఎన్నారై రాములు గల్ఫ్ వెళ్లగా ఆమె భార్య మంగ గ్రామంలో వడ్డీ వ్యాపారం నిర్వహిస్తుందన్న సమాచారం మేరకు మంగ ఇంటిపై దాడులు చేయగా రూ.రెండు కోట్ల మూడు లక్షల విలువైన ప్రాంసరీ నోట్లు, రూ.44 లక్షల విలువైన సాదబైనామా పెపర్లు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో చందుర్తి సీఐ శ్రీలత, ఎస్ఐ శ్రీకాంత్‌లు ఉన్నారు.

**సిరిసిల్లలో..** సిరిసిల్లలో ఎస్ఐ శ్రీనివాస్ తన సిబ్బందితో అంబికానగర్‌కు చెందిన ఈగ రాజు నివాసంలో సోదాలు చేయగా, సుమారు రూ.15.30లక్షల విలువైన 22 ప్రాంసరీ నోట్లు లభ్యమయ్యాయి. దీంతో ఈగ రాజును అదుపులోకి తీసుకొని, ప్రామిసరీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సిరిసిల్ల ఠాణాలో తదుపరి చర్యల కోసం అప్పగించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. రాజుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది రాజేశ్, తిరుపతి,శ్రీనివాస్ ,అక్షర్ ఉన్నారు.

# కమలంలో కల్లోలం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఇలాకాలో అసంతృప్తి సెగ



కరీంనగర్, జనవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కరీంనగర్‌లో బుధవారం (ఈ నెల 12వ తేదీ) జరిగిన పాతవర్గం బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. ఈ మీటింగ్‌లో చర్చించిన అంశాలపై 'కరీంనగర్ బీజేపీలో కుదుపు' పేరిట 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ప్రధాన సంచికలో గురువారం ప్రచురితమైన కథనం ఆ పార్టీలో కాక పుట్టించింది. సమావేశం నిర్వహించిన పలువురు నాయకులకు రాష్ట్ర స్థాయి నేతలు వరుస పెట్టి ఫోన్లు చేసినట్లుగా, అందులో మెజార్టీ నాయకులు 'మేం సైతం' కలిసి వస్తామని చెప్పగా.. కొంత మంది మాత్రం 'ఏం జరిగింది' అంటూ ఆరా తీసినట్లుగా తెలుస్తున్నది. 'నమస్తే తెలంగాణ'లో వచ్చింది వాస్తవమేనా..? అని కొంత మంది ఆరా తీయగా, 'మీటింగ్‌లో జరిగిందే వాళ్లు రాశారు. అందులో ప్రతీది అక్షర సత్యం' అని సదరు నాయకులకు తేల్చి చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. దాంతో రాష్ట్రంలోని అనేక మంది సీనియర్ నాయకులు సైతం కరీంనగర్ జిల్లా నాయకుల అభిప్రాయాలతో ఏకీభవించడమే కాదు, తమ జిల్లాల్లోనూ వివక్షకు గురవుతున్న నాయకులతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపినట్లు తెలుస్తున్నది. అంతేకాదు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒంటెత్తు పోకడ.. సొంత జిల్లాలో అతను అనుసరిస్తున్న తీరు, సొంత పార్లమెంట్ నియోజకవర్గంలో కార్యకర్తలను విస్మరిస్తున్న తీరు.. వంటి అనేక విషయాలను ఫోన్లు చేసిన రాష్ట్ర నేతలకు కరీంనగర్ నాయకులు వివరించినట్లుగా కొంత మంది సీనియర్లు తెలిపారు. మన పార్టీలో ఇలా కొట్లాడుకుంటే అధికారంలోకి ఎలా వస్తామని ఒక బీజేపీ రాష్ట్ర నాయకుడు ఫోన్‌లో మాట్లాడగా, కొంత మంది సీనియర్లు సీరియస్‌గా సమాధానమిచ్చినట్లు చెబుతున్నారు. కొత్తగా వచ్చిన మీరంతా అధికారం, స్వార్థ ప్రయోజనాల కోసం పాకులాడుతున్నారని, పార్టీ సిద్ధాంతాలను తుంగలో తొక్కుతున్నారని, కానీ, తాము మాత్రం తమ ఆత్మగౌరవంతోపాటు పార్టీ సిద్ధాంతపరంగా ముందుకెళ్తున్నామని ఘాటుగా సమాధానమిచ్చినట్లు సమాచారం. ఇంకా 'పార్టీ ముందుకెళ్లాలంటే.. ఒకరిద్దరిని ఇష్టారాజ్యంగా విమర్శిస్తే సరిపోతుందా? అసలు ఎజెండా లేకుండా మాట్లాడితే ఎలా..? ఏది మాట్లాడాలి.. ఎలా మాట్లాడాలి.. ఏ అంశంపై మాట్లాడాలి.. అన్న చర్చ ఏనాడైనా పార్టీలో జరుగుతున్నదా..? ఒంటెత్తు పోకడ ప్రదర్శిస్తే ఎలా..? అసలు మనపార్టీలో కొంత మంది మాట్లాడుతున్న తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు? కష్టపడి పనిచేసే కార్యకర్తలు ఎలా మదన పడుతున్నారు? ఏమనుకుంటున్నారో ఏనాడైనా తెలుసుకునే ప్రయత్నం చేశారా? అంటూ ప్రశ్నల వర్షం కురిపించినట్లు సమాచారం. అంతేకాదు, జాతీయ పార్టీగా కార్యకర్తల సంక్షేమానికి ఏం చేస్తున్నారు? ఎన్నికలు లేదా కార్యక్రమాలున్నప్పుడు రెచ్చగొట్టడం, వాడుకోవడం, ఆ తర్వాత వదలేయడమేనా..? ఏనాడైనా వారిని పట్టించుకున్నారా? ఇది వాస్తవం కాదా..? అని మమ్మల్ని కార్యకర్తలు అడుగుతున్నారు. వారికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత మనపై లేదా..? అని రాష్ట్ర నేతలను ప్రశ్నించినట్లు సమాచారం. అంతెందుకు కరీంగనర్ పార్లమెంట్ నుంచి ఎంపీగా గెలిచిన బండి సంజయ్ ఏనాడైనా కార్యకర్తల గురించి పట్టించుకున్నారా..? కనీసం వారితో మీటింగ్ పెట్టి.. వారి సాధకబాధకాలు విన్నారా..? వారి సంక్షేమం కోసం ఏమైనా చేశారా? వీటిపై 'ముందుగా రాష్ట్ర అధ్యక్షుడు సమాధానం చెప్పాలి' అని ప్రశ్నించినట్లు సమాచారం. ఆది నుంచీ పార్టీ కోసం పనిచేసిన తమ పరిస్థితి అలాగే ఉన్నదని, చాకిరీ చేయించుకోవడం వదిలేయడం పార్టీలో ఒక అలవాటుగా మారుతున్నదని, దీని వల్ల తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్నదన్న ఆందోళనతోనే తాము మీటింగ్ పెట్టుకున్నామని సీనియర్లు చెప్పినట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా.. రాష్ట్ర స్థాయి నేతలతోపాటు పలు జిల్లాల నుంచి భారీగా ఫోన్లు వచ్చినట్లుగా కొంతమంది కరీంనగర్ జిల్లా నాయకులు తెలిపారు. అన్ని జిల్లాల్లో బీజేపీ పాత తరం వర్గంలో అసంతృప్తి నెలకొన్నదని, కొత్త వారికి ఎర్రతివాచీలు పరిచి, పాత వారిని అగౌరవ పరుస్తున్నారని, అందుకే కరీంనగర్ తరహాలోనే తాము కూడా మీటింగ్ పెట్టుకుంటామని చెప్పినట్లు సమాచారం. పార్టీని బతికించుకోవాలన్న.. పార్టీ కోసం ముందు నుంచీ పని చేసిన వారికి ఆత్మగౌరవం నిలువాలన్న.. జరుగుతున్న తప్పులు, పార్టీ వెళ్తున్న పక్కదారులపై పార్టీ నిబంధనలకు లోబడి తిరుబాటు చేయాల్సిందేనన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. ఈ విషయంలో తాడే పేడో తేల్చుకోవడానికి సిద్ధమన్న అభిప్రాయం సైతం వ్యక్తమైందని కొంతమంది సీనియర్లు తెలిపారు. ఒంటెత్తు పోకడలతో పార్టీ పక్కదారి పట్టడమే కాదు.. వారి స్వార్థ ప్రయోజనాల కోసం పార్టీ పరువును బజారుకీడుస్తున్నారని, ఇన్నాళ్లూ కాపాడుకుంటూ వచ్చిన పార్టీని, పార్టీనే నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలు, శ్రేణులను పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని, దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్న అభిప్రాయాన్ని వ్యక్తంచేసినట్లు తెలుస్తున్నది. అంతేకాదు.. వేర్వేరు జిల్లాల్లో జరిగే మీటింగ్‌లకు కరీంనగర్ జిల్లాలో మీటింగ్ నిర్వహించిన సీనియర్ నాయకులు హాజరు కావాలని కోరినట్లు కొంతమంది నాయకులు తెలిపారు.

**ఇప్పుడు గుర్తుకొచ్చామా..?**

దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తున్నామని, పార్టీలో ఈ మధ్యకాలంలో కొత్త పోకడలు చూస్తున్నామని, తమ గురించి ఏ రోజైనా పట్టుంచుకున్నారా..? మా జిల్లా నుంచి ఉన్న రాష్ట్ర అధ్యక్షుడే మాకు కనీస సమాచారం ఇవ్వకుండా ఒంటెత్తు పోకడతో కార్యక్రమాలు నిర్వహిస్తుంటే.. ఆ రోజు మేం గుర్తుకు రాలేదా..? ఈ విషయంపై పలుసార్లు పలు రకాలుగా అసంతృప్తి వ్యక్తం చేసినా.. ఏనాడు ఎవరైనా పట్టించుకున్నారా..? అంటూ సీనియర్లు ప్రశ్నించినట్లుగా తెలుస్తున్నది. తమ ఉనికే ప్రశ్నార్థకమవుతున్న తరుణంలో.. పార్టీ సిద్ధాంతం కోసం మీటింగ్ పెట్టుకుంటే.. ఇప్పుడు మాట్లాడుతున్నారా..? అంటూ వారి అవేదనను వ్యక్తం చేసినట్లుగా తెలుస్తున్నది.

**కలిసి కదం తొక్కుదాం..?**

సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని మీటింగ్ నిర్వహించారని, ఇక నుంచి జరిగే మీటింగ్‌లకు తమకు సమాచారం ఇస్తే.. కలసి కదం దొక్కుదామని పలువురు కార్యకర్తలు సైతం సీనియర్లతో తమ ఆవేదనను వ్యక్తం చేసినట్లు తెలుస్తున్నది. ఏదో ఒక కార్యక్రమం పేరిట పిలుపునివ్వడం.. అక్కడ మేం ఇబ్బందులు పడడం.. ఆ తర్వాత అధినాయకత్వం చేతులు దులుపుకొని వెళ్లడం.. ఏమి ఇబ్బంది జరిగిందని ఆ తదుపరి మాట మాత్రం మాట్లాడకపోవడం.. ఫోన్లు చేస్తే ఎత్తకపోవడం వంటివే కాకుండా.. ఇన్నేళ్లుగా పనిచేస్తున్న కార్యకర్తల సంక్షేమం కోసం పార్టీ ఎమైనా కార్యక్రమం చేపట్టిందా..? అని తమ గోడును వెల్లబోసుకున్నట్లు తెలుస్తున్నది. ఇతర పార్టీలు కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తోంటే.. బీజేపీ మాత్రం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న ఆక్రోషాన్ని వెల్లగక్కినట్లు తెలుస్తున్నది. ఇటు రాష్ట్ర నాయకులు, అలాగే వివిధ జిల్లాల నుంచి వచ్చిన మద్దతు, కార్యకర్తల ఆవేదనను పరిగణలోకి తీసుకొని.. త్వరలోనే మరో సమావేశాన్ని నిర్వహించాలన్న ఆలోచనకు వచ్చినట్లు ఒక నాయకుడు తెలిపారు. అందులో తమ భవిష్యత్ కార్యాచరణను కూడా ప్రకటించాలని యోచించినట్లుగా పేర్కొన్నారు. మొత్తానికి బండి సొంత జిల్లాలో తిరుబాటు మొదలు కావడంతో.. బీజేపీలో ఒక్కసారిగా అసంతృప్తిసెగలు బయట పడుతున్నాయి.

# కారు పల్టీ కొట్టింది.. గుట్కా గుట్టు వీడింది



కారు ఢీకొట్టడంతో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

జగిత్యాల కలెక్టరేట్, జనవరి 13: పోలీసులను తప్పించుకొనే క్రమంలో అతివేగంగా వెళ్లిన కారు కరెంట్ స్తంభాన్ని, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టింది..పోలీసులు దగ్గరికి వెళ్లి పరిశీలించగా కారులో రూ. 3లక్షల విలువైన గుట్కా సంచులు కనిపించడం కలకలం రేపింది..గురువారం జగిత్యాల కేంద్రంలో జరిగిన ఈఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది.. జగిత్యాల టౌన్ సీఐ కిషోర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ వద్ద నిజామాబాద్– జగిత్యాల ప్రధాన రహదారిపై ఉదయం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. ఈ సమయంలో ఓ కారు పోలీసులకు చిక్కకుండా వేగంగా వెళ్లింది..కారు డ్రైవర్ వేగంగా నడపడంతో అదుపు తప్పి కోళ్ల దుకాణంలోకి వెళ్లడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న స్తంభాన్ని, ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టింది. ఈ ఘటనలో కరెంట్ స్తంభం విరిగిపడగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కరెంట్ విద్యుత్ స్తంభం విరుగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. కోళ్ల దుకాణంలోని 20 కోళ్లు మరణించాయి. పోలీసులు బోల్తాపడ్డ కారును తనిఖీ చేయగా రూ.5 లక్షల విలువైన నిషేధిత గుట్కా సంచులు లభ్యమయ్యాయి. స్వయంగా కారును నడుపుకుంటూ గుట్కాను అక్రమంగా తరలిస్తున్న ఇమ్రాన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కాగా, ఇమ్రాన్‌ను విచారించగా నిర్మల్‌కు చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు షఫీక్ అహ్మద్ నుంచి గుట్కాను కొనుగోలు చేసి జగిత్యాలకు రవాణా చేస్తున్నట్లు తేలింది. పోలీసులు నిర్మల్‌కు వెళ్లి షఫీక్ అహ్మద్ పాన్‌షాపులో రూ. 4 లక్షల గుట్కా ప్యాకెట్లు దొరికాయని తెలిపారు. అలాగే ఇమ్రాన్‌తో పాటు షఫీక్‌అహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.